ప్రజాశక్తి

శనివారం 25 జనవరి 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కమాండ్ కంట్రోల్‌ను ప్రారంభిస్తున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

నేరాల నివారణకు
లక్ష సిసి కెమెరాలు..

- రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తాం..
- నేర నియంత్రణే కమాండ్ కంట్రోల్ లక్ష్యం
- డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-చీరాల,బాపట్ల జిల్లా

నేరాలు చేయాలనే ఉద్దేశం నేరస్తులకు రాకూడదనేది ప్రథమ లక్ష్యమని, ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా లక్ష సిసి కెమెరాలు ఏర్పాటు చెయ్యడానికి ముందడుగులు వేస్తున్నామని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. శుక్రవారం బాపట్ల జిల్లాలోని చీరాల వన్ టౌన్, కారంచేడు పోలీస్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌ను, కారంచేడు పోలీస్ స్టేషన్లో సిబ్బంది కోసం నిర్మించిన వెయిటింగ్ హాల్‌లను డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మీడియాతో మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నూతన టెక్నాలజీని ఉపయోగించుకుంటూ భవిష్యత్తులో నేరాలు జరగటానికి, ఏవైనా అవాంఛనీయ ఘటన జరగడానికి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తడానికి అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి అత్యాధునిక పరిజ్ఞానంతో టూవే కమ్యూనికేషన్ విధానంతో చీరాల పట్టణంలో 150 సీసీ కెమెరాలను, అదేవిధంగా సముద్ర తీర ప్రాంతమైన ఓడరేవు నుండి పొట్టి సుబ్బయ్య పాలెం ▶ 2లో

మార్కాపురం జిల్లాపై మౌనం

- నెలలు గడుస్తున్నా మాటలతోనే కాలయాపన
- మంత్రులిద్దరూ సీరియస్‌గా తీసుకోలేదనే చర్చ
- స్థానిక ఎమ్మెల్యేలపై పెరుగుతున్న విమర్శలు.. ఒత్తిళ్లు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికలకు ముందు.. ఎన్నికల ప్రచార సభల్లో కూటమి నేతలు ఇచ్చిన కీలక హామీలపై ఇప్పుడు ఊసే కనిపించడం లేదు. వాటి ప్రస్తావన కూడా రావడం లేదు. ఏప హామీలు మాటలు చెప్పి ఓట్లు పొందారో వాటినే ఇప్పుడు పాలకపక్ష నేతలు మరిచిపోతున్నారు. అధికారంలోకి వచ్చాక ఉదాసీన వైఖరి పెరిగింది. చేద్దాములే ఇప్పుడు తొందరేముందీ అన్న మాటలు పాలకపక్ష నేతల నుంచి వినిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే ఎవరికీ పట్టడం లేదు. మార్కాపురం జిల్లా ఏర్పాటు హామీ ఇదే కోవకు వెళ్లింది. కందుకూరు, అద్దంకి జిల్లాలు ప్రకాశంలో కలిపేది ఈ నిర్ణయం అమలుతోనే ముడిపడింది. జిల్లా ప్రజానీకంలో ఎంతో ప్రాధాన్యత అంశంగా ఉన్న జిల్లాల మార్పులు, చేర్పులు అంశం పాలకపక్ష నేతలకు మాత్రం పట్టడం లేదు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా దాన్ని పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యేలపై విమర్శలు పెరుగుతున్నాయి. ఒత్తిళ్లు ఉన్నాయంటున్నారు. ఎన్నికలకు ముందు జిల్లా విభజన ఎజెండాతో అప్పటి ప్రభుత్వంపై సాగిన పోరాటాల్లో తెలుగుదేశం కూడా కీలకంగానే ఉంది. మార్కాపురం జిల్లా కోసం అన్ని పార్టీలూ కలిసి ఉద్యమించాయి. మార్కాపురంలో దీక్షలు నడిచాయి. ఆ ప్రాంత ప్రజానీకంలోనూ సెంటిమెంటు అంశంగా మారింది. దీన్ని గుర్తించిన అన్ని పార్టీలూ మార్కాపురం జిల్లా కోసం పోరాడాయి. అప్పట్లో చంద్రబాబు పశ్చిమ ప్రాంత పర్యటనలో గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన సభల్లో మార్కాపురం జిల్లానే ప్రధానంగా ప్రస్తావించారు. తర్వాత లోకేష్ పాదయాత్రలోనూ మరోసారి ▶ 2లో

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి స్వామి

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి స్వామి

7లో

బాలికలు స్వేచ్ఛగా ఎదిగే
సమాజ ఆవిష్కరణకు కృషి

- ఆడపిల్లలు లేని సమాజం చీకటితో సమానం
- బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత
- మంత్రి స్వామి
- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సామాజిక రుగ్మతలను రూపుమాపి ఆడపిల్లలు స్వేచ్ఛగా ఎదిగే సమాజ ఆవిష్కరణకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వ యంత్రాంగానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. 'జాతీయ బాలికా దినోత్సవాన్ని' పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ముందుగా 'బాలికా స్వేచ్ఛ - బాల్య వివాహాల నివారణ' కోసం మద్దతుగా ఏర్పాటు చేసిన బ్యానర్‌పై వీరు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడపిల్లలు లేని సమాజం చీకటితో సమానమని వ్యాఖ్యానించారు. ఆడపిల్లలు పుట్టకూడదనుకోవడం, బాల్యవివాహాలు చేయడం వంటి రుగ్మతలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ వారి వంతు బాధ్యత నిర్వహించాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలను నివారించడం కోసం కలెక్టరు ప్రత్యేక చొరవ తీసుకుని 'బంగారు బాల్యం' కార్యక్రమాన్ని రూపొందించారని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సమాజంలో చర్చ ప్రారంభమైందని, మరింత ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తరపున రూపొందించే ప్రతి పోస్టరులోనూ బంగారు బాల్యంపై తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సాధికారతతో ఆరోగ్యకరమైన కుటుంబం ఏర్పడుతుందని, ఇందుకు విద్యే ప్రధాన ఆధారమన్నారు. ఇప్పటికీ స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళలు ఆర్థిక సాధికారత సాధించేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. బాల్య వివాహాలను నివారించడం కోసం అవసరమైతే కెజిబివి రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో బాలికలకు సీట్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ స్వీయ నిర్ణయ స్థాయికి మహిళలు ఎదగాలన్నారు. ప్రతి బాలిక కనీసం డిగ్రీ పూర్తి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమాజంలోని పరిణామాలను గమనిస్తూ ▶ 2లో



ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

చేనేత వస్త్రాల నిల్వలను
ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ
- చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-చీరాల

చేనేత వస్త్రాల నిల్వలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ అన్నారు. చేనేతలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చేనేత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో చీరాలలోని స్థానిక ఏడీ కార్యాలయం వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు భట్టిప్రోలు, ఐలవరం అనగాల, రాజోలు, ఈపురుపాలెం, చీరాల పలు ప్రాంతాల నుండి చేనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ చేనేతల సమస్యల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్. గంగయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్‌తో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ముందుగా పట్టణంలో చేనేత నాయకులు ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం ఏడీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె హేమసుందర్ రావు, మురుగుడు సత్యనారాయణ, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి.కొండయ్య సిఐటియు డివిజన్ అధ్యక్షులు ఎన్.బాబూరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా దీపాల సత్యనారాయణ, నాయకులు వై రాధ, బట్టు నాగమల్లేశ్వరరావు, రాఘవయ్య, సూర్యనారాయణ, జి.మురళి, సుబ్బారావు పాల్గొన్నారు.

నేరాల నివారణకు

లక్ష సిసి కెమెరాలు..

(మొదటిపేజీ తరువాయి)

వరకు 30, సముద్రానికి ప్రధాన రాకపోకల మార్గాల్లో 30 సీసీ కెమెరాలను మొత్తం 210 సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందన్నారు. ఈ సీసీ కెమెరాలన్నింటినీ అనుసంధానం చేసి చీరాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి పరిశీలించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా 25 మ్యాన్‌ప్యాక్‌లు, ఒక డ్రోన్, ఎల్ఈడి మానిటర్లు, రిపీటర్ వ్యవస్థ, ప్రతి కెమెరా వద్ద కూడా పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం పెట్టడం ద్వారా ఈ వ్యవస్థలన్నింటినీ ఒక తాటి మీదకు తీసుకువచ్చి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా కమాండ్ కంట్రోల్ భవనం నుండి నేరుగా ఆదేశాలు జారీ చెయ్యవచ్చని, సమీపంలో ఉన్న ప్రజలు కూడా ఈ పీఏ సిస్టం ద్వారా ఆదేశాలు అందుకొని జాగ్రత్త పడవచ్చని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల నేర నియంత్రణ చేయవచ్చని, నేర పరిశోధనకు కూడా ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతంలో యాత్రికులకు మరింత రక్షణ ఇవ్వవచ్చని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా లక్ష కెమెరాలను అమర్చాలనే ఉద్దేశంతో ముందడుగు వేస్తున్నామన్నారు. ఇటీవల 1,150 కెమెరాలను విజయవాడ పట్టణంలో అమర్చడం జరిగిందని తెలిపారు. నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకుంటున్నామని తెలిపారు ఎక్కడ నేరం జరిగినా సమాచారం వెంటనే తెలిసిపోతుందన్నారు. ఇటీవల సూర్యలంక సముద్ర తీర ప్రాంతంలో కార్తీక మాసంలో డ్రోన్ల సహాయంతో సముద్రంలో మునిగిపోతున్న వారిని గుర్తించి గజఈతగాళ్ళు, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ముగ్గురు భక్తుల ప్రాణాలను కాపాడారని తెలిపారు. విజయవాడ హాస్పటల్లో ఒక పాపను అపహరించడం జరిగిందని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే ఆ కేసును గంటల వ్యవధిలోనే ఛేధించడం జరిగిందన్నారు. డ్రోన్లు, సీసీ కెమెరాలు, బాడీ ఓన్ కెమెరాలు ఇతర సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ప్రజలను ఉద్దేశించి డిజిపి మాట్లాడుతూ ప్రజలు వారి వారి ప్రాంతాల్లో వారి అవసరాలకు తగినట్లుగా దుకాణాలలో గానీ, అపార్ట్మెంట్ వద్ద, వ్యాపార సముదాయాల వద్ద, వారి ఇంటి పరిసరాలలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. అలా ముందుకు వచ్చిన వారికి పోలీస్ శాఖ తరపు నుండి కూడా ప్రోత్సహిస్తామని తెలిపారు. అనంతరం కారంచేడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ పైన నూతనంగా నిర్మించిన సిబ్బంది విశ్రాంతి హాలును ప్రారంభించారు. కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ చీరాల పట్టణంలో ఇటువంటి అధునాతన వ్యవస్థ అందుబాటులోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు రేంజి ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి, చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య, పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఇతర పోలీస్ అధికారులు, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పరిటాల రవి 20వ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మొత్తం 80 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో వైద్యులు బాషా, నాగరాజు, గ్రామ తెలుగు యువత నాయకులు కోట రవి, కోట శ్రీనివాసరావు, అల్లంనేని సాయి, పమిడిమళ్ల వెంకటేశ్వర్లు, పిన్నింటి రఘు, కోట సుమంత్, పిన్నింటి బాలకృష్ణ, అల్లంనేని సుధీర్, బెల్లం సురేష్ కోట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-మద్దిపాడు

పిహెచ్‌సిని పరిశీలిస్తున్న అధికారులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా సర్వేలను చేపడుతుందని, రానున్న కాలంలో ఈ సర్వేల ఆధారంగా ప్రజలకు అవసరమైన వైద్య చికిత్సలు, మందులు అందజేస్తారని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ టి వాణిశ్రీ, డాక్టర్ బి శ్రీవాణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. అదేవిధంగా మండలంలో జరుగుతున్న నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సిడి), కుష్టు వ్యాధి, రాష్ట్రీయ బాల్ స్వస్థకార్యక్రమం, పునరుత్పత్తి, పిల్లల ఆరోగ్య కార్యక్రమం గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న కార్యక్రమాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెల్లంపల్లి గ్రామంలో జరుగుతున్న ఎన్‌సిడి, ఎల్‌సిడిసి సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి వాణిశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేలను చేపట్టాయని రానున్న కాలంలో ఈ సర్వే ఆధారంగా ప్రజలకు అవసర మైన వైద్య చికిత్సలు మందులు అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ బి శ్రీవాణి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు తలపెట్టిన కుష్టు వ్యాధి సర్వేకు సంబంధించి ప్రతి ఇంటిని, ప్రతి ఒక్కరినీ తప్పకుండా స్క్రీనింగ్ చేసి వారికి ఎలాంటి జబ్బులు ఉన్నాయన్న విషయాన్ని ఆన్‌లైన్లో అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రవణ్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఆనంద్ మోహన్, డాక్టర్ శిరీష చంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ రజితకుమారి, హెల్త్ సూపర్వైజర్లు కె బాలకోటయ్య, కె సీతమ్మ, ఎ నాగరాజి, హెల్త్ సెక్రటరీ శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పి లిడియా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలోత్సవాలు

ప్రజాశక్తి-చీమకుర్తి: చీమకుర్తి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక చెరుకూరి వెంకటేశ్వర్లు మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోటీలను డాక్టర్ చెరుకూరు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. బాలోత్సవాల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులకు దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 432 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కడవ రామకృష్ణ, కె సుధాకర్‌రావు మాట్లాడుతూ శనివారంనాడు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతి ప్రదానం కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నాయకులు ఎడ్లపల్లి రాంబ్రహ్మం, పి శ్రీనివాస్‌మూర్తి, అడుసు మల్లి శ్రీనివాసరావు, పోకూరి రామకృష్ణారెడ్డి, గొల్లపూడి వెంకట్రావు, గొల్లపూడి చౌదరి, ఆదినారాయణ, నాగళ్ల సత్యం,

డాక్టర్ శిద్దా సుధాకర్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చీమకుర్తి

ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు, టిడిపి సీనియర్ నాయకులు శిద్దా సుధాకర్‌కు పలువురు టిడిపి నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం స్థానిక సుధాకర్ నివాసంలో పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పూనాటి వెంకట్రావు, మన్నం వెంకయ్య, నూకల సుబ్రమణ్యం, రావిపాటి శ్రీనివాసరావు, కందిమల్ల వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

'మార్కాపురం జిల్లా'పై మౌనం

(మొదటిపేజీ తరువాయి)

హామీలు ఇప్పించారు. అధికారంలోకి రాగానే జిల్లాల ఏర్పాటు ఉంటుందని చెప్పారు. ఎన్నికల ఏడాది కూడా పోయింది. కొత్త ఏడాది వచ్చింది. అయినా మార్కాపురం జిల్లా విషయం మరుగునపడింది. కొత్తకొత్త ఎజెండాలు తెరపైకి తెచ్చారు. విజన్-2047 పేరుతో కొత్త ప్రాజెక్టులను తెస్తున్నారు. కేంద్రం చేసిన విజన్‌కు అనుగుణంగా ఇక్కడా గణాంకాలు తయారు చేసి నివేదికలు రూపొందిస్తున్నారు. ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా కనిపిస్తోంది. ఇక ఉమ్మడి ప్రకాశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఇద్దరు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి ఇద్దరూ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాత్రం దీనికోసం కొంత ప్రయత్నాల్లో ఉన్నారు. మిగతా ఎమ్మెల్యేలకు అంతగా పట్టడం లేదనే చర్చ కూడా ఉంది. ఇక కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా వీలైనంత త్వరగా నెల్లూరు జిల్లా నుంచి బయటపడాలనే ఆలోచనలోనే ఉన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు కూడా ఇదే భావనలో ఉన్నారు. ప్రజానీకం కూడా కందుకూరును ప్రకాశంలోనే కలపాలనే కోరుతున్నారు. అద్దంకిని ప్రకాశంలో కలపాలనే డిమాండ్ ఎన్నికల వరకూ బాగానే నడిచింది. ఈ డిమాండ్‌ను తెచ్చిన అప్పటి ఎమ్మెల్యే గొట్టిపాటి ఇప్పుడు మంత్రిగా ఉన్నారు. దీంతో అంతా ఆయన నిర్ణయమే కదా? అనే భావన నేతల్లో ఉంది. బాపట్ల వెళ్లడానికి ఆ నియోజకవర్గ నేతలతోపాటు ప్రజలూ తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పాలనా సౌలభ్యం కోసం జిల్లాల ఏర్పాటు జరిగింది. ఆ సౌలభ్యమే ఇప్పుడు కనిపించడం లేదు. నియోజకవర్గాల పునర్విభజన ఉన్నందున దానికోసం జిల్లాల విభజన జాప్యం చేస్తున్నారా? అనే చర్చ సాగుతోంది.

పశువుల వ్యాధుల నివారణ మందుల కోసం

బడ్జెట్లో నిధులు పెంచాలి: జిఎంపిఎస్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

పశువుల వ్యాధుల నివారణ మందుల కోసం నిధుల కేటాయింపులు పెంచి మూగజీవాలను కాపాడాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ కార్యదర్శి తోట తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపి గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం గిద్దలూరు మండలం జయరాంపురం, కేఎస్ పల్లి, తిమ్మాపురం గ్రామాల్లో పర్యటించి గొర్రెలు మేకల్లో వస్తున్న వ్యాధులను పరిశీలించారు. ప్రధానంగా గత రెండు నెలల నుంచి మూతి వాపులు, జ్వరాలు తదితర వ్యాధులతో గొర్రెలు, మేత మేయకుండా నీరసించి చనిపోతున్నాయని పెంపకందారులు కమిటీ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. నివారణ మందుల కోసం ప్రైవేట్ మెడికల్ షాపుల్లో వేలాది రూపాయలు పెట్టి మందులు కొనుగోలు చేసి వైద్యం చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. తిమ్మాపురం గ్రామంలో గొంగటి శ్రీనివాసులుకు చెందిన పది గొర్రెలు చనిపోయినట్లు తెలిపారు. పశు వైద్యశాలలకు వెళితే అక్కడ సంబంధిత మందులు లేనందున ప్రైవేటు మందుల మీద ఆధారపడాల్సి వస్తోందని అన్నారు. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో ఇలాంటి వ్యాధుల వలన వందలాది జీవాలు చనిపోతున్నాయన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలలో ఉచితంగా మందులు పంపిణీ చేసి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మేడబలిమి బ్రహ్మయ్య, చప్పిడి రామయ్య, గొంగటి నరేష్, బి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూలుకు మౌలిక సదుపాయాల కల్పన

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలోని కుమ్మరిపాలెం పాఠశాలలో ఐడిబిఐ బ్యాంక్ ఒంగోలు బ్రాంచ్ ఆధ్వర్యంలో సిస్టార్ ఇన్ ఇంటియేటివ్ ప్రోగ్రాం ద్వారా రూ.1,50,000 తో మౌలిక సదుపాయాలు కల్పించారు. అందులో భాగంగా రెండు కంప్యూటర్స్, టేబుల్స్, కుషన్ చైర్స్, లేజర్ ప్రింటర్ ఇచ్చారు. అదేవిధంగా విద్యార్థులకు తాగడానికి మంచినీటి వసతి కోసం ఆక్వా ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల కోసం 15 చైర్స్, ఆఫీస్ టేబుల్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ ఏజీఎం చందన్, ఐడిబిఐ ఒంగోలు బ్రాంచ్ మేనేజర్ సురేష్, సిబ్బంది, ఎంఈఓ 1 అండ్ 2 తులసి కుమారి, పద్మావతి, హైస్కూల్ హెచ్ఎం సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు మాలకొండయ్య, సాయి ప్రసాద్, గ్రామ నాయకులు పోలయ్య, విద్యా కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఆనందమోహన్

మంచి విద్యను అభ్యసించాలంటే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆనందమోహన్ అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులోని ఎస్సీ హాస్టల్లోని విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించిందని చెప్పారు. వసతి గృహం విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్ష, ఎత్తు, బరువు, ఇఎన్‌టి పరీక్షలు చేయించారు. విద్యార్థులు శుభ్రతను పాటించి నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని, జంక్ ఫుడ్ జోలికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సకాలంలో ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాఘవులు, హెల్త్ సూపర్వైజర్ బాలకోటయ్య, దరియా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు స్వేచ్ఛగా ఎదిగే..

సమాజ ఆవిష్కరణకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

సొంత భావాలు వ్యక్తపరిచేలా ఉండాలని, తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కూడా విజన్ డాక్యుమెంట్‌లో మానవ వనరుల అభివృద్ధి-వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తు చేశారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ లింగభేదం లేకుండా తల్లిదండ్రుల ఆలోచన విధానం మారాలని పిలుపునిచ్చారు. బాలికల చదువే భవిష్యత్తులో వారికి దిక్సూచిలా ఉంటుందన్నారు. బాలికలలోని ప్రతిభా పాటవాలను గుర్తించి వారు ఉన్నత స్థానాలకు ఎదిగేలా అండగా నిలవాలని ఆమె సూచించారు. డిఎంహెచ్ఓ డాక్టర్ టి వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పీడీ హేనా సుజన్ వారి శాఖల పరంగా బాలికల అభివృద్ధికి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్ మాట్లాడుతూ బాలికల సంరక్షణ, అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్న జిల్లా యంత్రాంగంతో తాము మరింతగా కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో బాల్య వివాహాల నిషేధం కోసం ప్రభుత్వం రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించి, బాల్య వివాహాలు చేసుకోబోమని, జరగనివ్వబోమని, బాధ్యత గల పౌరులుగా వ్యవహరిస్తామని విద్యార్థులతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిఇఒ కిరణ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, జిల్లా బిసి సంక్షేమ అధికారి అంజల, కార్మిక శాఖ సహాయ కమిషనర్ అనిత, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ జి. అర్చన, డిసిపిఒ దినేష్‌కుమార్, స్టెప్ సిఇఒ శ్రీమన్నారాయణ, సిడిపి లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్

ప్రజాశక్తి - రేపల్లె

నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిలాల్ మట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం ప్రజాసమస్యల మీద పోరాటాలు నిర్వహించే సిపిఎం ఇప్పటికే మండల,పట్టణ, జిల్లా మహాసభలు పూర్తి ేసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజా సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. నెల్లూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలు మీద పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. రాబోవు కాలంలో రాష్ట్రంలో నిర్వహించే పోరాటలకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. విశాఖస్టీల్‌కు సొంతగనులు ఇవ్వాలని, టిడ్కో గహాలను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని, కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాలను సమగ్రాభివద్ధి చేయాలని సిపిఎం మహాసభ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశ సార్వభౌమత్వం, లౌకికవాదం, సమాఖ్య స్ఫూర్తి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మధ్యతరగతి రంగాల సమస్యలపై నిరంతరం సిపిఎం ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలపై భారాలు మోపే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యక్తిరేకంగా నికరంగా సిపిఎం పోరాడుతున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్వహణ కోసం నిర్వహిస్తునర్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కె.ఆశీర్వాదం, కెవి.లక్ష్మణరావు, వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి -బాపట్ల

ఉపాధి హామీ పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఎన్ఆర్ఇజిఎస్ రాష్ట్ర కార్యాలయ విభాగం అధికారి జెవి.సునీల్ కుమార్ తెలిపారు. బాపట్లలోని విస్తరణ శిక్షణా కేంద్రంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివద్ధి సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపులో భాగంగా యుక్త ధార (పోర్టల్) ద్వారా ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఎన్ఆర్ఇజిఎస్ పనులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో 756 మందికి శ్రీకాళహస్తి కేంద్రంలో 1320 మందికి కలిపి మొత్తం సుమారు 3700 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే 12 వరకూ ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నటు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ డి. వెంకట్రావు,రాష్ట్ర స్థాయి సామర్థ్య పెంపుదలశిక్షణా విభాగం పర్యవేక్షకులు కె.స్వరూప రాణి , ఎన్ఆర్ఇజిఎస్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సునీల్ కుమార్

ఒకే బస్సు.. మూడు ప్రమాదాలు..

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - బాపట్ల

ఓ ప్రైవేటు కళాశాల బస్సు డ్రైవర్ హాల్ చేశాడు. మూడు చోట్ల ప్రమాదాలు చేశాడు. ఆయా ఘటనల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. అందిన వివరాల ప్రకారం... చీరాల సెయింట్ కళాశాల ఆన్స్ బస్సు విద్యార్థులను తీసుకొని బాపట్ల-కర్లపాలెం మార్గంలో వెళ్తుంది. తొలుత బాపట్ల మండల పరిధిలోని నందిరాజుతోట వద్ద కూరగాయల బండిని ఢీకొంది. తర్వాత హైదరుపేట వద్ద బైకును, కర్లపాలెం మండలం సత్యవతి పేట వద్ద స్కూటీని డీ కొట్టింది. ఈ ఘటనల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వామనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. కూరగాయలు బండి దెబ్బతింది. కూరగాయలు రోడ్డుపై చెల్లాచెదురు దురుగా పడ్డాయి. ఈ ఘనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజాశక్తి- వేమూరు

దావోస్ పర్యటన ముగించుకొని ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దావోస్ అనుభవాలు, అక్కడి పరిస్థితి గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే ఆనందబాబు అడిగి తెలుసుకున్నారు.

సిఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వ్యవసాయ శాఖ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ప్రభుత్వ పథకాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేర్చినప్పుడే ఆ అధికారి ప్రజల మన్ననలు చూర గొంటారని ఒంగోలు ఎడిఎ బి.ఎఫ్రాయిమ్ తెలిపారు. అందుకు మార్టూరు ఎఒ వీరగంధం కిరణ్ కుమార్ వంద శాతం అర్హుడని తెలిపారు. మార్టూరు ఎఒగా పనిచేస్తూ బదిలీపై విజిలెన్స్ శాఖకు వెళ్తున్న కిరణ్‌కుమార్ వీడ్కోలు, నూతన ఎఒగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంజిరెడ్డికి స్వాగతం పలుకుతూ స్థానిక ఇంటూరి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సభలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎడిఎ బి.ఎఫ్రాయిమ్ గత ప్రభుత్వ హయాంలో కిరణ్ కుమార్ ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, ఎరువులు పంపిణీ తదితర విషయాల్లో పారదర్శకంగా పనిచేసినట్లు తెలిపారు. కిరణ్ కుమార్ నిత్యం రైతులతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిం చేందుకు కృషి చేసినట్లు తెలిపారు. సన్మాన గ్రహీత కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగానిర్వర్తించడమే తప్ప అదనంగా తాను ఏమీ చేయలేదని తెలిపారు. సమాజానికి పట్టెడు అన్నం పెట్టే రైతులకు సేవ చేయటం తన అదష్టంగా భావించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టూరు, పర్చూరు, అద్దంకి ఎడిఎలు కెవి. శ్రీనివాసరావు, ఎన్.మోహన్‌రావు, ధనరాజు బాపట్ల, అద్దంకి, యద్దనపూడి, బల్లికురవ, సంత మాగులూరు ,కొరిశపాడు, జె. పంగులూరు ఎఒలు అనీల్, కె. వెంకటకష్ణ, మేరమ్మ, కుమారి, లావణ్య శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, ఎఇఒలు తదితరులు పాల్గొన్నారు.

ఎఒలను సన్మానిస్తున్న అధికారులు

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- వేమూరు

మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన దండే వెంకటరామయ్య , వేమూరు గ్రామానికి చెందిన కైతేపల్లి అశోక్ కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు శుక్రవారం అందజేశారు. దండే వెంకటరామయ్య రూ.46,800, కైతేపల్లి అశోక్ కుమార్‌కు రూ.38,500 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి- పర్చూరు

పర్చూరుకు చెందిన గునంనేని శ్రీదేవికి చెందిన పది ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతి అయింది. అందిన వివరాల వప్రకారం... శీదేవి కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో వరిగడ్డి వామినుంచి పొగలు రావడాన్ని ఇరుగు పొరుగు గమనించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. వీలు కాలేదు. చీరాల అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలాన్ని చేరుకొని మంటలను అదుపుచేశారు. ఎస్ఐ మాల్యాద్రి, విఆర్ఒ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. 10 ఎకరాల్లోని వరిగడ్డి కాలి బూడిద అయ్యిందని,దాని విలువ రూ.లక్ష రూపాయలు ఉంటుందని బాధితురాలు శ్రీదేవి తెలిపారు.

మాస్టర్స్ అథ్లెట్స్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

విజేతలకు సన్మానం

ప్రజాశక్తి -బాపట్ల

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహించి మాస్టర్ అథ్లెట్స్ పోటీల్లో పాల్గొని పరుగు పోటీల్లో పతకాలు సాధించి అబ్దుల్ నజీర్, షేక్ ఇమామ్ బాపట్ల ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేశారని బాపట్ల అంజుమన్ -ఎ- ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీం తెలిపారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో మాస్టర్స్ అథ్లెట్స్‌ను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ అనేక పతకాలు సాధించి అబ్దుల్ నజీర్ ,షేక్ ఇమామ్‌లు బాపట్ల కు గర్వకారణంగా నిలిచారన్నారు. మాస్టర్స్ అథ్లెట్స్‌తో పాటు గుంటూరు రైల్వే డివిజన్ సభ్యుడిగా నియమితులైన పఠాన్ రాజేష్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ కరీం, న్యాయవాది జమ్రుద్ బాషా, దిలీప్, మాజీ అధ్యక్షుడు జిలాని, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జింగి ఫుడ్ యాప్ ను ప్రారంభిస్తున్న డాక్టర్ రాజకుమార్

జింగి ఫుడ్ యాప్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

ఆహార వంటకాలను ప్రజలకు అతి తక్కువ సమయంలో నేరుగా ఇంటికి అందించే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ జింగి యాప్ సర్వీస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజ్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ సర్వీస్ జింగి యాప్‌ను పట్టణంలోని పాపరాజు తోటలోఉన్న భావనమ్మ కళ్యాణమండపంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజకుమార్, ఫౌండర్ అండ్ సిఇఒ కె. మురళీకష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ కష్ణ మాట్లాడుతూ జింగి ఫుడ్ డెలివరీ యాప్ ఏర్పాటు చేసి అన్ని ప్రాంతాలలో విజయవంతంగా ఫుడ్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చీరాల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన జింగి సర్వీస్ ప్రజలు వినియోగించు కోవాలన్నారు. డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన గమన బిజీలైఫ్‌లో ఫుడ్ డెలివరీ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఫుడ్‌తో పాటు నిత్యావసర సరుకులు, మెడిసిన్, కాస్మోటిక్ వస్తువులను సకాలంలో డెలివరీ చేయటం వీరి ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జింగి యాప్ మేనేజర్ డి.భారతి, కె.కళ్యాణ్, ఫ్రాంచైజీస్ మేనేజర్ కొండా రవి, చీరాల సారీస్ అధినేత వలివేటి వంశీ, వేటపాలెం రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి. మోహన్‌రావు, తుపాకుల నాగేశ్వరరావు, ఎర్రం మమత, సుమన్, పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి- ముండ్లమూరు

ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పని ఎస్ఐ వై. నాగరాజు తెలిపారు. స్థానిక తాళ్లూరు సెంటర్‌లో ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. వాహనాల్లో అధికంగా వెళ్తున్న కూలీలను దించారు. అనంతరం ఆటో డ్రైవర్లు, నాలుగు చక్రాల వాహనాల డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పరిమితికి మించి వాహనాలలో ఎక్కువ సంఖ్యలో కూలీలను ఎక్కించుకొని పొలాలకు తీసుకువెళ్తే అలాంటి వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు బాలికలదే..

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

చెరుకుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - రేపల్లె

దేశ భవిష్యత్తు బాలికలదేనని, బాలికలు భావి భారత దీపికలని సిడిపిఒ ఎం. సుచిత్ర తెలిపారు. మండల పరిధిలో ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూల్, ఎబిఆర్ డిగ్రీ కళాశాల, పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత విద్యార్థినులకు ఈజీ రైటింగ్, కాపీ రైటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం సిడిపిఒ మాట్లాడుతూ ఆడపిల్లలు వంటింటికే పరిమితం అయ్యే కాలం మారిందన్నారు. నేటి సమాజంలో పురుషులతోపాటు పోటీగా అన్ని రంగాల్లోనూ అత్యున్నత స్థాయిలో ప్రతిభ కనపరుస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి తల్లిదండ్రులు తమకు ఆడపిల్ల కావాలనే విధంగా గర్వంగా ఎదగాలని సూచించారు. బాలికల సాధికారిత, ఆరోగ్యం, పోషకాహారం, చదువు, హింస, లైంగిక దోపిడీ నుంచి రక్షణ, భద్రత, స్వేచ్ఛ పై ప్రభుత్వాలు, సమాజం, సంస్థలు కషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.. బాలికల హక్కుల పరిరక్షణ కుటుంబం నుంచే ప్రారంభం కావాలన్నారు. చదువుకొనే స్వేచ్ఛ, నాణ్యమైన విద్య ,నైపుణ్యాలు బాలికలకు అందుబాటులో ఉన్నప్పుడే బాలికల భవిష్యత్తు అభివద్ధి పథంలో చూడగలమన్నారు. ఈ కార్యక్రమంలో రామకష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ అవర్ణ, రేపల్లె రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, ఎబిఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ టిసి.రవిచంద్ర కుమార్, డాక్టర్ సముద్రాల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొల్లూరులో మాట్లాడుతున్న సిడిపిఒ విజయలక్ష్మి

చుండూరు : మండలపరిధిలోని ఎడ్లపల్లి హైస్కూల్‌లో అంగన్‌వాడీ సూపర్ వైజర్ జి.శకుంతల ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ బాలికల ఉజ్వల భవిష్యత్, హక్కులు విద్య, ఆరోగ్యం, భద్రత గురించి అవగాహన కల్పించారు. సాధికారిత సాధించే దిశగా బాలికలు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఎఎన్‌ఎం ఎంఎస్‌కె, అంగన్‌వాడీలు, బాలికలు పాల్గొన్నారు.

ముండ్లమూరు : స్థానిక కస్తూరిబా బాలిక విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల రక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల అనే సమస్యలు తలెత్తుతాయన్నారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా, బాలికల చట్టాలు, ఆత్మహత్యల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ సునీత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, ఎమ్మెస్‌కె టి. శాంతి ప్రియ, ఎఎన్‌ఎం ప్రభావతి, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో మాట్లాడుతున్న సిడిపిఒ సుచిత్ర

చెరుకుపల్లి : బాలికలు అంకితభావంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పల్లపట్ల సిడిపిఒ ఎం. అనసూయ కోరారు. మండల పరిధిలోని గూడవల్లి ఎంఎన్‌ఎం హైస్కూలు, రాజోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో బాలికలు అన్ని రంగాలలో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. మరింత పట్టుదలతో ముందుకు సాగి ఆర్థికాభివద్ధి తద్వారా తమ కుటుంబ అభివద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఎం.గౌరీ, అంగన్‌వాడీలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చిన్నగంజాం : మండల పరిధిలోని కడవకుదురు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా ఆడపిల్ల దేశానికి గర్వకారణం, ఆడపిల్లని పుట్టనిద్దాం, బతకనిద్దాం, ఎదగనిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఉష, అంగన్ వాడీలు, జిల్లా పరిషత్ హై స్కూల్ మహిళా టీచర్స్ ఫస్ట్ అసిస్టెంట్ కె.రామారావు ప్రధానో పాధ్యా యుడు రామారావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కారంచేడులో మాట్లాడుతున్న సిడిపిఒ తిరుమల శెట్టి ఝాన్సీ

కొల్లూరు : మండల పరిధిలోని అనంతవరం హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిడిఒ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత శుభ్రత , గుడ్ టచ్, బాడ్ టచ్ ,వివాహములో లింగ వివక్షత ,మహిళా సాధికారిత, బాలికల అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కామినేని శ్రీనివాసరావు , ఎస్‌కె. శివ నాగిని , ఎఎన్‌ఎం కుమారి ,ఎంఎల్ హెచ్‌వి. విజయ, అంగన్‌వాడీలు, విద్యార్థినులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

నిజాంపట్నం : బాలికలు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ప్రజ్ఞం జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొలసాని రమేష్ అన్నారు. మండల పరిధిలోని ప్రజ్ఞం హైస్కూల్‌లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బాలిక విద్యతోనే దేశాభివద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశ భవిష్యత్తు బాలికలదేనన్నారు బాలికలు శ్రద్ధతో, అంకితభావంతో కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఆర్థికంగా అభివద్ధి చెందాలంటే చదువు ఒకటే మార్గమని చెప్పారు. ఎస్ఎస్‌కె. అనిత మాట్లాడుతూ బాలికలను ఎవరైనా వెంబడించిన, ఈవ్‌టీజింగ్ చేసినా తల్లిదండ్రులకు లేదా పాఠశాల ఉపాధ్యాయులకు లేదా మహిళా పోలీసులకు తెలియజేయాలన్నాఉ. చెప్పారు.సూపర్ వైజర్ జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకో వాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం ఫిరోజ, అంగన్‌వాడీలు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

కారంచేడు : మండల పరిధిలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకొల్లు సిడిపిఒ తిరుమల శెట్టి ఝాన్సీ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీతా నేరమని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరకూ కృషి చేయాలన్నారు. బాలికలందరూ బాగా చదవి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. బాలికల హక్కులు వారికున్న చట్టాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు, సూపర్‌వైజర్ సునీత, వైద్యశాల సిబ్బంది, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్లు సజ్జ పుష్ప వల్లి, లీలావతి మాట్లాడుతూ బాలికలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాల న్నారు. పౌష్టికాహారం తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం శిరోరాణి, మహిళా పోలీస్ పి.పద్మజ, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యద్దనపూడి : యద్దనపూడిలో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఒ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆషా వర్కర్లు, ఎఎన్‌ఎంలు, గురుకుల పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండల పరిధిలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ సంపూర్ణ మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. బ్యాల వివాహాలను నిర్మించి బాలికలను భావి భరత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. బాలికల హక్కులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వేటపాలెంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్

అమృతలూరు : మండల పరిధిలోని ఇంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ శాంతిశ్రీ మాట్లాడుతూ బాలిక విద్యావంతులైతే ఆ కుటుంబం ఆదర్శవంతంగా తీర్చిదిద్దపడుతుందన్నారు. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన పౌష్టికాహారాన్ని బాలికలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

చుండూరులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ముండ్లమూరులో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ఆడపిల్లలు స్వేచ్ఛగా పెరగాలి

బాలికా దినోత్సవ సభలో కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆడపిల్లలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించి స్వేచ్ఛగా పెరగాలని, సమాజానికి పట్టుకొమ్మలుగా వారిని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి.. కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరంలో ఒక రోజున బాలికల సమస్య గురించి పెద్ద ఎత్తున చర్చ జరగాలన్నారు. చర్చ జరిగినప్పుడు ఆ బాలికల సమస్యలు, సమాజం బాలికల పట్ల ఎలా వ్యవహరిస్తుంది అనే విషయం తెలుస్తుందన్నారు. తద్వారా కొంత మార్పు జరిగే అవకాశం ఉందన్నారు. దాన్ని ఆశించి ప్రతి సంవత్సరం జనవరి 24వ తేదీన బాలికా దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. బిడ్డ, తల్లి గర్భంలో ఉండగానే అక్రమంగా పరీక్షలు చేయించి, ఆడ,మగ అని తెలుసుకొని చట్ట వ్యతిరేకంగా అబార్షన్లు చేయిస్తున్నారని అన్నారు. ఆడపిల్లలు తల్లి గర్భంలో ఉన్న దగ్గర నుండి చనిపోయేదాకా అనేక రకాలైన వివక్షలను ఎదుర్కొంటున్నారన్నారు. ఆడపిల్ల పుట్టుకతో వచ్చే వివక్ష, పుట్టుక గురించి వివక్ష, పోషకాహారంలో వివక్ష, చదువులో వివక్ష, పెంపకంలో వివక్ష, ఉద్యోగాలు చేసే చోట లైంగిక వేధింపులు, భర్త దగ్గర వేధింపులు, ముసలి వారైనా తర్వాత వారి పిల్లల దగ్గర వేధింపులు ఈ విధంగా అనేక రకాలైన సమస్యలను ఆడవాళ్ళు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు కనుకనే వారి గురించి మాట్లాడుకోవాలని అన్నారు. ఆడపిల్లలపై వేధింపులు జరగకుండా చూసుకోవాలన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకోవాలని అన్నారు. ఒక సంపూర్ణమైన, ఆహ్లాదకరమైన, సంతోషకరమైన వాతావరణంలో స్వేచ్ఛగా వారిని పెరగనివ్వాలన్నారు. ఆ విధంగా మనం సమాజాన్ని సంస్కరించుకోవాలన్నారు. ఈ సంవత్సరం బాలికలను రక్షిద్దాం- బాలికలను చదివిద్దాం అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణలో జిల్లా కలెక్టర్ సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వివిధ సంస్థల్లో జరిగిన వ్యాసరచన పోటీలో మొదటి స్థానంలో నిలిచిన 120 మంది పిల్లలకు, క్రీడల్లో జాతీయస్థాయిలో ఆడిన వారికి, సెకండరీ విద్యను ప్రోత్సహించేందుకు, బాలికలను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ అధికారి పి గ్లోరియా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ఉమా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జె రాజ దిబోరా, బీసీ సంక్షేమ శాఖ అధికారి జెవి శివలీల, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఇతర అధికారులు, బాలికలు పాల్గొన్నారు.

డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలి

- డిటిసి ఆర్.సుశీల - కంటి వైద్యశిబిరం ప్రారంభం

మాట్లాడుతున్న డిటిసి ఆర్.సుశీల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని పాఠశాల, కళాశాల డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో పాఠశాల, కళాశాల డ్రైవర్లకు రహదారి భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డిటిసి మాట్లాడుతూ మద్యం తాగి, అధిక వేగంతో వాహనాన్ని నడప రాదని సరైన పత్రాలు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారి ఫైర్ అలారం సిస్టం, ఫైర్ డిటెక్టివ్ సిస్టంలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తరువాత ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల కంటి పరీక్షలు, వైద్య శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మోడరన్ ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అర్జున షాఫర్, డాక్టర్ ఎంవి రమణారెడ్డి, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బి.రామాంజనేయులు, మోటార్ వాహన తనిఖీ అధికారి ఏ. కిరణ్ ప్రభాకర్, ఎల్. సురేంద్ర ప్రసాద్, రామచంద్రరావు, జి. బాస్కరరావు సహాయ మోటార్ తనిఖీ అధికారులు కె. జయప్రకాష్, యు. ధర్మేంద్ర, బి. భాను ప్రకాష్, ఏఒ శ్రీనివాసులు రావు పాల్గొన్నారు.

2న గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కళామిత్రమండలి (తెలుగు లోగిలి)-వివిఐటి సంస్థల సంయుక్త నిర్వహణలో ప్రముఖ పద్యకవి, గిడుగు పురస్కార గ్రహీత డి.వి.యం.సత్యనారాయణ రచించిన 'శ్రీకష్ణలీలారింఛోళి' గ్రంథావిష్కరణ సభ స్థానిక ఒంగోలులోని యన్.టి.ఆర్ కళాక్షేత్రంలో ఫిబ్రవరి 2న జరుగుతుందని కళామిత్రమండలి జాతీయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ముఖ్యఅతిథిగా, పుస్తకావిష్కర్తగా అవనిగడ్డ శాసనసభ్యులు, పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కందుల

సమస్యలను పరిష్కరించేందుకే వార్డుల పర్యటన

మార్కాపురం ఎమ్మెల్యే 'కందుల'

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించేందుకు వార్డుల పర్యటన చేపట్టినట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు 'మన ఊరు-మన ఎమ్మెల్యే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలోని 1వ వార్డులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వార్డులోని ప్రజలతో మాట్లాడారు. స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, ఎఎంసి మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో 'రిపబ్లిక్ డే'

- కార్యక్రమ నిర్వహణలో కోఆర్డినేషన్ ఉండాలి
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశ 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఇందుకు వేదిక అయిన పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను శుక్రవారం ఆమె సందర్శించి ఈ దిశగా చేస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిపబ్లిక్ డే వేడుకలలో పాల్గొనేందుకు, వీక్షించేందుకు వచ్చే వారి హోదా, సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణలో సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని తెలిపారు. అతిథులకు సీట్ల కేటాయింపు, వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చే వారికి తాగునీరు, ఇతర స్నాక్స్, అవసరమైన స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. పోలీసు కవాతు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్దిష్ట సమయం ప్రకారం జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను తెలియజేసేలా స్టాల్స్ ఉండాలని, ఈ దిశగా వీటి ఏర్పాట్ల విషయంలో శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్‌పి ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ ఈ వేడుకలకు అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు హాజరవుతుండటంతో అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఏఎస్‌పిలు కె.నాగేశ్వరరావు, అశోక్ బాబు, డిఆర్‌ఒ బి.చిన ఓబులేసు, ఒంగోలు ఆర్‌డివో కె.లక్ష్మి ప్రసన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాత్రికిరాత్రే ప్రభుత్వ భవనం నేలమట్టం

- వైద్య శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే
- కూల్చేసిన మున్సిపల్ అధికారులు
- ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన డిఎంహెచ్‌ఒ

జెసిబితో ప్రభుత్వ భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఎవరైనా ఏదైనా ఒక ప్రైవేటు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టి ఉంటే దాన్ని తొలగించే క్రమంలో ముందస్తుగా సంబంధిత వ్యక్తులకు గానీ, సంస్థలకు గానీ నోటీసులు జారీ చేసి.. వారు స్పందించకపోతే ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వాటిని ధ్వంసం చేసే అధికారం ప్రభుత్వ అధికారులకు ఉంటుంది. కానీ మార్కాపురం పట్టణంలో ఎన్నో సంవత్సరాల నుండి ఇప్పటివరకు మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ అనుభవంలో ఉన్న భవనాన్ని సంబంధిత శాఖ అధికారులకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే రాత్రికిరాత్రి మున్సిపల్ అధికారులు జెసిబితో నేలమట్టం చేశారు. దీంతో మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు డిఎంహెచ్ఒకు ఫిర్యాదు చేయడంతో డిఎంహెచ్ఒ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మార్కాపురం పట్టణంలో గురువారం అర్ధరాత్రి హైడ్రామా నడిచింది. పట్టణంలోని కంభం సెంటర్‌లోని అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌ను సంబంధిత శాఖ అధికారులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ కమిషనర్ వారి సిబ్బందితో, పోలీసుల సాయంతో కూల్చివేతకు సిద్ధమయ్యారు. అందులో కొంతభాగాను సైతం కూల్చివేశారు. అక్కడ ఉన్న స్థానికులు, చిరు వ్యాపారులు భవనం లోపల రూ.లక్షల విలువ గల ప్రభుత్వ సామగ్రి ఉందని చెబుతున్నా.. పట్టించుకోకుండా మున్సిపల్ కమిషనర్ కూల్చివేతకు శ్రీకారం చుట్టారు. కూల్చివేతపై సమాచారాన్ని అందుకున్న అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ సంబంధిత అధికారి అక్కడికి చేరుకొని కూల్చివేతను అడ్డుకున్నారు. కార్యాలయంలో విలువైన సామాగ్రితో పాటు వ్యాక్సిన్లు, పలు రికార్డులు, వ్యాక్సినేషన్లు భద్రపరిచే రిఫ్రిజిరేటర్లు ఉన్నాయని, ప్రతి బుధవారం ఇక్కడి నుంచే పట్టణ వ్యాప్తంగా వ్యాక్సినేషన్లు సరఫరా చేస్తామని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీద్ త్రివినాగ్‌కు చెప్పారు. ఇక్కడే వ్యాక్సినేషన్ కూడా చేయటం జరుగుతుందన్నారు. వెంటనే సబ్‌కలెక్టర్ తాళాలు తెరిచి లోపలికి వెళ్లి చూడగా రిఫ్రిజిరేటర్లు రికార్డులు, వ్యాక్సినేషన్లు, భద్రపరిచే ఫ్రిజ్‌లు, మలేరియా వ్యాధికి సంబంధించిన మందులు ఉండటంతో.. తీవ్ర అసహనానికి గురైన సబ్ కలెక్టర్ వెంటనే అక్కడ నుంచి వెళ్లిపోయారు. 25 సంవత్సరాలుగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తూ.. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌ను అర్ధరాత్రి సమయంలో కూల్చివేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని పుర ప్రజలు మున్సిపల్ అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం అక్కడ చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించేందుకే కార్యాలయాన్ని కూలుస్తున్నామంటూ చెబుతున్నారు. కానీ ప్రతిపక్ష పార్టీలు మాత్రం ప్రభుత్వ పెద్దల నుండి వద్ద నుండి వచ్చిన ఆదేశాలను మున్సిపల్ అధికారులు తూచా తప్పకుండా పాటించడం పరిపాటిగా మారిందని ఆరోపిస్తున్నారు. ఘటనపై మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ సహదీద్ వెంకట్ త్రివినాగ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి తమ శాఖకు చెందిన ఉన్నతాధికారుల నుండి అనుమతి లేకుండా తమ కార్యాలయాన్ని ఎలా కూలగొడతారంటూ ప్రశ్నించారు. తమ శాఖకు చెందిన ఉన్నతాధికారుల నుండి నో అబ్జెక్షన్ వచ్చేంతవరకు వేచి ఉండాలన్నారు. తమకు ప్రత్యామ్నాయంగా ఇంకొక ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని ఉద్యోగులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇది మంచి పద్ధతి కాదు..

సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

ప్రభుత్వ భవనం కూల్చివేత విషయంలో ఉద్దేశపూర్వకంగానే తనను తప్పుదోవ పట్టించారని, ఇది మంచి పద్ధతి కాదని, పద్ధతి మార్చుకోవాలని మార్కాపురం ఉప కలెక్టర్ సహదీద్ వెంకట త్రివినాగ్, మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సుబ్బారావును మందలించారు. శుక్రవారం తన కార్యాలయానికి ఇద్దరు అధికారులను పిలిపించి.. మాట్లాడారు. భవనం కూల్చివేతకు సంబంధించి ముందస్తుగా సంబంధిత అధికారులకు తెలియజేయకుండా అందులోని సామాగ్రిని ఖాళీ చేయించకుండా ఉన్నఫలంగా తనను స్పాట్‌కు తీసుకొని వెళ్లి ఇలా తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

వధువును ఆశీర్వదించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వధువుకు 'ఉగ్ర' ఆశీర్వాదం

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు షేక్ రహీం కుమార్తె వివాహ వేడుకలులో శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం పాల్గొని వధువును ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు, చెరుకుపల్లి వెంకటరెడ్డి, సయ్యద్ దౌలత్‌భాష, ఆర్ఆర్ రఫి, శ్రీను, మస్తాన్, ఖాజావలి పాల్గొన్నారు.



శ్రావణ్‌కుమార్‌ను సన్మానించిన ప్రజాసంఘాల నాయకులు

తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి-దర్శి

నియోజకవర్గంలో ఓటర్లను జాగృతి చేసి 92.91 ఓటర్లను పోల్స్ చేసిన సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా ఓటర్ల దినోత్సవం రోజు అవార్డు అందుకోబోతున్న తహశీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను రాష్ట్ర దళితసేన, ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దళితసేన నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడిపూడి ప్రేమ్‌కుమార్, బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు వెంకటేశ్వర్లు తహశీల్దారును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిట్ట రమేష్, గర్నెపూడి నరసింహ, గట్టుపల్లి ప్రసాద్, గోపాలుని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొండ చిలువలను పట్టుకున్న దృశ్యం

పది అడుగుల కొండ చిలువ పట్టివేత

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండలంలోని సోమేపల్లిలో గుమ్మ గోపి అనే రైతు మిర్చి పొలంలో పది అడుగుల కొండ చిలువ కలకలం రేపింది. కూలీలు మిరపకాయలు కోస్తుండగా కొండచిలువను చూసి భయబ్రాంతులకు గురయ్యారు. వెంటనే ఫారెస్ట్ స్నేక్ రిక్యూవర్ మల్లికార్జునకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని చాకచక్యంగా పట్టుకొని గోనే సంచిలో బంధించారు. అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టాడు. దీంతో కూలీలు ఊపిరి పీల్చుకున్నారు.

దావోస్ పర్యటన విజయవంతం

ప్రజాశక్తి-దర్శి

తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దావోస్ సదస్సు వేదికగా ప్రపంచ దేశాలకు చాటడం ద్వారా పర్యటన విజయ వంతమైందన్నారు. స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్‌తో సమావేశం, స్విస్ కంపెనీలు ఓర్లికాన్, స్విస్ మెన్, ఆంగ్స్ ఫిష్టర్, స్విస్ టెక్స్టైల్స్ సంస్థల సిఇఓలతో ఎపిలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారని తెలిపారు. సీఐఐ నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై ఎంతో ఆసక్తిదాయకంగా ప్రసంగించి, స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లోని 10 మార్గదర్శక సూత్రాల గురించి వివరించారని ఆమె పేర్కొన్నారు.

అంత్యక్రియలు అడ్డగింత..సల్లూరులో ఉద్రిక్తత

- తీవ్ర ఆందోళనల నడుమ మృతదేహం ఖననం
- ఎస్పీ జోక్యంతో కదిలిన పోలీస్ యంత్రాంగం
- బాధితులను పరామర్శించిన రామచంద్ర యాదవ్
- న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పొదిలి

మండలంలోని సల్లూరు గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఉద్రిక్తత ఒక మృతదేహాన్ని 24 గంటలుపైగా ఖననం చేయకుండా నిలిపేశారు. గ్రామంలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన యలగల వెంకటేశ్వర్లు(46) అనారోగ్యంతో బుధవారం విజయవాడలో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఖననం చేసేందుకు బంధువులు గురువారం ఉదయం గ్రామానికి తీసుకువచ్చారు. హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు చేస్తున్న ప్రయత్నాలను కమ్మ సామాజిక వర్గం అడ్డుకున్నారు. దీనిపై రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. గతంలో తాము స్మశానానికి స్థలం ఇచ్చామని, తాము పూడ్చుకోడానికి అర్హత లేదా అంటూ యాదవ సామాజిక వర్గం వారు కమ్మ సామాజిక వర్గం వారితో ఘర్షణకు దిగారు. దీంతో గ్రామంలో మృతదేహాన్ని రోడ్డుపై వదిలేసి మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ టి వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన గ్రామానికి చేరుకుని రెండు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎంతసేపటికి కొలిక్కి రాకపోవడంతో రాత్రి పొద్దుపోయే వరకు మృతదేహం అక్కడే ఉంచారు. అర్ధరాత్రి 11 సమయంలో ఎస్పీకి సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో దర్శి డిఎస్పి గ్రామానికి చేరుకొని రెండు సామాజిక వర్గాల వారిని ఒప్పించి తెల్లవారు జామున రెండున్నర గంటల సమయంలో మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ సంఘటనపై విషయం తెలుసుకున్న బిసివైపి వ్యవస్థాపక అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ గురువారం ఉదయం సల్లూరు గ్రామంలో పర్యటించారు. భాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘీభావం ప్రకటించారు. జరిగిన సంఘటనను ఆయన దృష్టికి తీసుకొని వెళ్ళారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని కోరుతూ ఆయన పొదిలి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలీసులతో మాట్లాడేందుకు రామచంద్ర యాదవ్ ఒక్కరినే అనుమతించడంతో కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదాన్ని దిగారు. కుటుంబ సభ్యులను కూడా పోలీసులతో మాట్లాడేందుకు అనుమతించాలని కోరడంతో ఘర్షణ వాతావరణం జరిగింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నంద్యాల, ఒంగోలు జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రాస్తారోకో చేస్తున్న వారిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో కొంత ఉద్రిక్తత చోట చేసుకుంది. అనంతరం బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి యాదవ మహాసభ నాయకులు, కార్యకర్తలు, బిసివైపి నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన కారులతో మాట్లాడుతున్న డిఎస్‌పి లక్ష్మినారాయణ

రోజంతా రోడ్డుపైనే ఉన్న మృతదేహం

ఆర్టీసీకి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఆర్టీసీకి అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్సులను ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం శుక్రవారం అందజేసింది. ఒంగోలు ఆర్టీసీ డిపోలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీకష్ణ డిపో మేనేజర్ డి శ్రీనివాసులకు బహుకరిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకష్ణ మాట్లాడుతూ తన చిన్నప్పటినుండి ఏపీఎస్ ఆర్టీసీతో అనుబంధం ఉందని అన్నారు. కుటుంబ సభ్యులలో కూడా ఆర్టీసీ ఉద్యోగస్తులు ఉన్నారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య సేవలు అందించడంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎల్లప్పుడు ముందుంటుందని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి సుధాకర్, డిపో మేనేజర్ అభ్యర్ధన మేరకు ఆర్టీసీ బస్సులలో ప్రధమ చికిత్స కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. తమ హాస్పిటల్ వైద్యశిభిరాల్లో అన్ని రకాల మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలకు ఉచిత ఓపి, ఉచితంగా బిపి, షుగర్, థైరాయిడ్, ఎముకల పట్టుత్వ పరీక్ష, నరాల స్పర్శ పరీక్ష, హిమోగ్లోబిన్, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డిపో మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు డిపోకు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానిక్) విజయ, సూపరింటెండెంట్ బాలిశెట్టి ఫణి కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, రీజినల్ మేనేజర్ ఆఫీస్ అసిస్టెంట్ చిన్నయ్య సూరి, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఫస్ట్‌ఎయిడ్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

మాజీ మంత్రి పరిటాల సునతను కలిసిన దర్శి నాయకులు

'పరిటాల'ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-దర్శి

మాజీ మంత్రి పరిటాల రవీంద్ర ఘాటు వద్ద దర్శి నాయకులు పరిటాల సురేష్, భాస్యం పిచ్చయ్య, హరి, బోట్ల సుబ్బారావు, రమణారెడ్డి అందరు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంద్భంగా రవన్న పేదల పెన్నిధి, బడుగు, బలహీనర్గాలకు అభివృధి కోసం కృషి చేసిన నాయకుడని అన్నారు. ఈ సందర్భంగా పరిటాల రవీంద్ర సతీమణి మాజీ మంత్రి పరిటాల సునీతను అనంతపురంలో కలిశారు.

టీచర్లకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉల్లాస్ కేంద్రాలను నిర్వహించాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉల్లాస్ వయోజన విద్య కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని వెలుగు ఏపీఎం సుధాకరరావు అన్నారు. స్థానిక మహిళా సమైక్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని నిరక్షరాశులను గుర్తించి చదువు నేర్పించాలనే దృడ సంకల్పంతో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా వాలంటీర్ టీచర్లు ముందుకు రావడం అభినందనీయమన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత మీపై ఉందని ఉల్లాస్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ చెన్నారెడ్డి సూచించారు. అనంతరం వాలంటరీ టీచర్లకు మెటీరియల్‌ను, చదువు నేర్చుకునే వారికి పుస్తకాలను ఐఓఆర్‌డి శ్రీదేవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు యంబాడి ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న పెట్లూరు ప్రాథమిక వైద్య సిబ్బంది

పెరిదేపిలో ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - కొండపి

మండలంలోని పెరిదేపి గ్రామంలో విషజ్వరాలు తీవ్రంగా ఉండడంతో పెట్లూరు ప్రాథమిక వైద్య బృందం ఇంటింటి సర్వే చేపట్టారు. డాక్టర్ అనూష ఇంటింటికి వెళ్లి చుట్టుపక్కల పరిసరాలు గమనించి సూచనలు, సలహాలు ఇచ్చారు. జ్వరంతో బాదపడుతున్న వారిని గమనించి వివరాలు అడిగి తెలుసుకొని వైద్య సేవలు అందించారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై దృష్టి సారించి పాగింగ్ నిర్వహించారు. ఎంపిడిఒ స్వయంగా గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య పనులు పురమాయించారు. గత నాలుగు రోజు నుంచి మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఆరోగ్య పరిస్థితులు బాగాలేని వారికి ఉచితంగా మందులు అందచేస్తున్నారు. దోమల మందును వీదివీదిన చల్లించారు.

మంచులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారులు

ప్రమాదకరంగా పొగ మంచు

ప్రజాశక్తి-కొండపి

పొగ మంచు చుట్టేసింది. దీంతో వీధులు ఉదయం 9.30 గంటల సమయంలో సైతం చీకట్లు అలుముకున్నాయి. కనీసం మంచినీళ్లు, కూరగాయలు, తెచ్చుకునేందుకు సైతం ప్రజలు నానా అవస్థలు పడ్డారు. అంగళ్లు 8 గంటల తర్వాత తెరుచుకున్నాయి. పాఠశాలలకు, కళాశాలలకు వేళ్లే విద్యార్థులు సైతం ఆలస్యంగా వెళ్లారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాల మీద ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొగ మంచువల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతారని, ఎదురొచ్చే వాహనాలు కనపడక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాదారులు పొగ మంచు కురిసే సమయంలో రోడ్లపై ప్రయాణించకుండా ఉండాలని ఎస్ఐ ప్రేమకుమార్ తెలిపారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి స్వామి

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులందరూ కష్టంతో కాకుం డా ఇష్టంతో చదువుకున్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం బాపట్ల లోని దివ్యాంగుల వసతిగృహాన్ని పరిశీ లించారు. అనంతరం చీరాల పట్టణం ఉడ్ నగర్ లోని బాలికల వసతిగృహం మరియు ఆనంద నిలయంను ఆయన చీరాల నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరి మహేందర్‌నాథ్‌తో కలిసి ఆకస్మికం గా తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థుల గదు లను, భోజనశాలను, వంటగదిని, మరుగు దొడ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులను అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో పలుచోట్ల లైట్లు లేకపోవడంతో వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల వసతి గృహానికి సంబం ధించి భవనం ఆధునీకరణకు, హాస్టల్ అభివృద్ధికి రూ.37 లక్షల నిధులను కేటాయించటం జరిగిందన్నారు. త్వరలోనే భవనాన్ని మరమ్మ తులు చేయించి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అనేక సదుపాయాలు కల్పిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నోటు పుస్తకాలు అదనంగా కావాలని కోరడంతో వారికి ఆ పుస్తకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్లో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. చీరాల ఎల్‌బిఎస్ నగర్‌లో శిథిలావస్థలో ఉన్న హాస్టల్‌ను త్వరలోనే తొలగించి.. భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, గోపికృష్ణ, చినగంజాం తహశీల్దార్ ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ...

కార్పొరేషన్ చైర్మన్ ప్రకటించాలని వినతి

బాపట్ల : వికలాంగులకు కార్పొరేషన్ చైర్మన్ ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామికా వికలాంగుల సంక్షేమ సంఘం జనసేన విభాగం జిల్లా అధ్యక్షులు గోగన ఆదిశేషు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బధిరుల ఆశ్రమ పాఠశాల సందర్శనకు వచ్చిన సందర్భంగా మంత్రి డోలా వీరాంజనేయ స్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. చిరువ్యాపారాలు చేసుకుంటున్న వికలాంగులకు ప్రభుత్వం రూ రెండు లక్షల సబ్సిడీతో రూ 5 లక్షలు రుణాలు ఇవ్వాలన్నారు. 10 సెంట్లు చొప్పున స్థలాన్ని కేటాయించి వికలాంగుల కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని కోరారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలోకంది వెంకటరెడ్డి, పఠాన్ జానీ బాషా,మౌలాలి, వీర్రాజు ,గంట నాగమల్లేశ్వరరావు,ముద్దా రవికిరణ్ తదితరులు ఉన్నారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హేమప్రియ

ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండల పరిధిలోని గురువుపాలెంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ ఎం.హేమ ప్రియ, పశు వైద్య సిబ్బంది పాల్గొని పశువులకు, దూడలకు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమప్రియ మాట్లాడుతూ పశుపోషకులు పడ్డ దూడల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలన్నారు. చలికాలంలో గేదలు, పడ్డదూడలు ఎక్కువగా ఎదకు వస్తాయని వాటిని ఈ సమయంలో కట్టిస్తే త్వరగా చూడి నిలబడుతుందన్నారు. పెయ్య దూడలకు వీర్యం స్థానిక పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉందన్నారు. పశు పోషకులు బహువార్షిక పశుగ్రాసాన్ని సాగు చేయాలన్నారు. .ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం డెయిరీ ప్రెసిడెంట్ కొలసాని లక్ష్మీ ప్రసాద్, పశుపోషకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

26న మద్యం దుకాణాలు మూత

ప్రజాశక్తి - అద్దంకి

ఈ నెల 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా అద్దంకి ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాలను మూసి వేస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ భవానీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి 10 గంటలకు మద్యం దుకాణాలకు సీల్ వేసి సోమవారం ఉదయం 10 గంటలకు సీల్ తీయనున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్మకాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మద్యం దుకాణదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. బెల్టు షాపులలో మద్యం విక్రయిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల పరిధిలోని చింతమోటు గ్రామంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఇన్‌ఛార్జి ఎఇ శాంతకుమారి తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందితో సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి

ప్రజాశక్తి-ముండ్లమూరు

విద్యుత్ బకాయిలపై స్పెషల్ నిర్వహించాలని విద్యుత్ డిఇ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ముండ్లమూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ మండలంలో మొత్తం రూ. 2.87 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలు, వ్యవసాయ మోటారు కనెక్షలపై రూ. 2.87 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. రైతులకు, వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు ను అందించేందుకు విద్యుత్ స్తంభాల కింద ఉన్న చెట్లను, ఓబ్బకంపను తొలగించాలన్నారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పిఎం సోలార్ పథకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎఇ అంకబాబు, సబ్ ఇంజినీర్ ఇమ్మాన్యియేల్ బాబు, లైన్ ఇన్స్పెక్టర్ సాంబయ్య, లైన్ మ్యాన్లు ఆంజనేయులు కోటేశ్వరరావు నాయక్, జెఎల్ఎంలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, టిడిపి నాయకులు పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. పరిటాల రవి మరణించి సంవత్సరాలు గడుస్తున్నా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే ఉన్నారని తెలిపారు. పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 778 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య ప్రసాద్ మాట్లాడుతూ పరిటాల రవి సీమ నేలపై బడుగు బలహీన వర్గాల కోసం గర్జించినట్లు తెలిపారు. పీడిత ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించాలన్న తపనతో తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేశారనికొనియాడారు. ఫ్యాక్షన్ నిర్మూలన కోసం రాజీ లేని పోరు సాగించి, ఆ ఆశయ సాధనలోనే బలైనట్లు తెలిపారు. ప్రజాసేవే ఊపిరిగా బతికి జీవితాంతం పీడిత ప్రజలకు అండగా నిలిచిన అమరజీవి పరిటాల రవి అని పేర్కొన్నారు. రవీంద్ర చేపట్టిన కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ ముందుకెళ్తామన్నారు. గత 19 సంవత్సరాలుగా పరిటాల యువసేన పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్త దానం.. ప్రాణ దానంతో సమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిటాల యువసేన అధ్యక్షుడు దండమూడి ధరణి కుమార్, గూడపాటి శ్రీనివాసరావు, పంతాని మురళీధర్ రావు, అజయ్, పరిటాల యువసేన నాయకులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి

బొకేలు తీసుకురావొద్దు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి- మార్టూరు

ఈనెల 26న తన పుట్టిన రోజు సందర్భంగా తనను కలిసేందుకు వచ్చేవారు బొకేలు, శాలువలు ,కేకులు, పూలమాలలు, తీసుకురావొద్దని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. బొకేలు, శాలువలు ,కేకులు, పూలమాలలకు అయ్యే ఖర్చుతో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, బ్యాగులు, పెన్సిళ్లు, మ్యాట్లు, వాటర్ బాటిళ్లు, ఇతర సామగ్రి అందజేయాలన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు, అనాథ శరణాలయాల్లో వద్ధులకు పండ్లు పాలు పంపిణీ చేయాలని సూచించారు. అందరూ ఓ నిర్ణయం తీసుకొని అమలు చేయాలని కోరారు. సమాజ హిత కార్యక్రమం చేపట్టడం ద్వారా పేద,మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు ఈ నిర్ణయాన్ని అమలు చేసి సరికొత్త విధానానికి నాంది పలకాలని ఎమ్మెల్యే కోరారు.

తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి -బాపట్ల

తూనికలు,కొలతల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికల కొలతల ఇన్‌స్పెక్టర్ బి. రామదాస్ హెచ్చరించారు. బాపట్ల పట్టణంలోని చేపలు, కూరగాయల మార్కెట్‌లో తూనికల యంత్రాలు, కాటాలు, తూకం రాళ్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామదాసు మాట్లాడుతూ వ్యాపారులు సైతం వినియోగదారులేనని తెలిపారు. హోల్‌సేల్‌గా తెచ్చుకునే ఏ వస్తువునైనా తూకాల్లో మోసాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత చిరు వ్యాపారులపై ఉందన్నారు. తూనికలు కొలతల్లో మోసం, అన్యాయం జరిగితే వినియోగదారులపై భారం పడుతుందన్నారు. న్యాయబద్ధంగా వ్యాపారాలు చేసుకుని నిర్దిష్టమైన కొలతలతో తాము విక్రయించే చేపలు, మాంసం, ఇతర నిత్యావసర సరుకుల అమ్మకాలు చేయాలని రామదాస్ తెలిపారు. తూకాలు కొలతల్లో మోసం జరుగుతుందన్న అనుమానం వస్తే వినియోగదారులు తక్షణమే తూనికలు కొలతల అధికారులకు సమాచారం అందించాలన్నారు.

తూనికల యంత్రాన్ని పరిశీలిస్తున్న రామదాస్

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - నిజాంపట్నం

శేషగిరిరావు(ఫైల్)

నిజాంపట్నం మండలం పల్లపట్ల పంచాయతీ పట్టపువారిపాలెం ఎంపిపి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపా ధ్యాయుడిగా పనిచేస్తున్న డొక్కు శేషగిరిరావు (55) గుండె పోటుతో రేపల్లెలోని తన స్వగృహంలో శుక్రవారం మృతి చెందారు. శేషగిరారావు గతంలో మండల పరిధిలోని కొమరవోలు, నిజాంపట్నం ప్రభుత్వ పాఠశాలల్లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు.మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. శేషగిరిరావు మృతి పట్ల యుటిఎఫ్ మండల శాఖ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు సంతాపం తెలిపారు.

కల్లు గీత కులాలకు

మద్యం దుకాణాలు కేటాయింపు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కల్లు గీత కులాలకు రిజర్వు చేసిన మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి ప్రకటించారు. కల్లుగీత, గౌడ కులాలకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ లాటరీ పద్ధతిలో స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జరిగింది. అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని కలెక్టర్ చెప్పారు. అందులో భాగంగా జిల్లాలో 12 మద్యం దుకాణాలకు పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించామన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి పకడ్బందీగా మద్యం దుకాణాలు కేటాయించామన్నారు. గౌడ్ కులాలకు నాలుగు దుకాణాలు, గౌడ కులస్తులకు ఎనిమిది దుకాణాల చొప్పున 12 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి. దేవదత్, బాపట్ల సహాయ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే దామచర్ల

ప్రకాశం జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహణ అభినందనీయమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ప్రకాశం జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఏర్పడి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా మంగమూరు రోడ్డులోని శ్రీ సత్యసాయి ఆశ్రమంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ప్రకాశం జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ ఏర్పడి 50 ఏళ్ళు పూర్తి కావటం ఆలిండియా అధ్యక్షులు జెప షిండే పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు, ప్రజలకు మందులు అందించటం పట్ల అభినందనలు తెలిపారు.

వికలాంగుల సంక్షేమం కోసం కృషి

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి - వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్లలో బధిర విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి స్వామి

రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం బాపట్ల నియోజకవర్గం వెదుళ్లపల్లిలోని ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగులకు, వసతి గహాల్లో ఉన్న పిల్లలకు వారి ఖాతాలోనే పెన్షన్ వేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని వసతి గ్రహాల్లో విద్యార్థులకు పెన్షన్లు వారి ఖాతాలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. బాపట్ల బధిరుల ఆశ్రమ పాఠశాలలో బాలురు వసతి గృహంలో పిల్లలకు అవసరమైన ఇనుప మంచాలను,బధిరులు ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాల్లో విద్యార్థులు భోజనాలు చేయడానికి అవసరమైన టేబుల్లు, కుర్చీలను స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్ల,వంటశాలను, డైయినింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వసతులపై పేపర్ మీద రాసి ఇచ్చిన వినతులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, సయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా,వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

‘బాలల కోసం భారత రాజ్యాంగం’

పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

బాలల కోసం భారత రాజ్యాంగం పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ డి.బి.ఆర్.సి ఆధ్వర్యంలో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగ ప్రవేశిక లక్ష్యాలు అర్థమయ్యే విధంగా చిత్రాలతో రూపొందించిన పుస్తకాన్ని బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్‌శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తిని తెలియజేసేలా రాజ్యాంగ ప్రవేశికలో పొందుపరిచిన పదాల అర్థాలు తెలియజేసే విధంగా బొమ్మలతో రూపొందించిన పుస్తకం అద్భుతంగా ఉందని అన్నారు. ఈ కృషి చేసిన డి.బి.ఆర్.సి బందానికి అభినందనలు తెలిపారు. డిబిఆర్‌సి ఏరియా కోఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేతత్వంలో రూపొందించబడిన రాజ్యాంగంలో పౌరులందరికీ సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మరియు సౌభ్రాతత్వం కలిగి ఉండాలని, ప్రజలందరికీ సమాన అవకాశాలు హక్కులు కల్పించిందని అన్నారు. రాజ్యాంగ పీఠిక రాజ్యాంగ స్ఫూర్తిని తెలియజేస్తుందని, అందుకే డిబిఆర్‌సి పీఠిక లోని అంశాలను విద్యార్థి లోకానికి తెలియజేసే లక్ష్యంగా ఫోటోలను రూపొందించి అన్ని జిల్లాలలోని విద్యా సంస్థలలో ఎగ్జిబిషన్ ను నిర్వహించడం జరిగిందని తెలిపారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి.ప్రకాష్, డి.బి.ఆర్.సి ప్రతినిధులు డానీ, ఎన్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా అభివృద్ధిపై

సమగ్ర నివేదిక రూపొందించండి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

డిడిఆర్‌సి సమావేశానికి బాపట్ల జిల్లా అభివద్ధిపై సమగ్ర వివరాలతో తాజా సమాచారాన్ని తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి అధికారులను ఆదేశించారు. డిడిఆర్‌సి సమీక్ష నిర్వహణపై మందస్తు సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన నిర్వహించారు. పిపిటి నివేదికను పరిశీలించారు. సమాచారం సమగ్రంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఇంటింటి ప్రజారోగ్య సర్వే నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకు 66,946 గహాలలో ఆరోగ్య సర్వే పూర్తి చేశామన్నారు. ఏ కుటుంబాన్ని వదలకుండా ప్రణాళికతో సర్వే చేయాలన్నారు. ప్రాంతీయ వైద్యశాలను జిల్లా వైద్యశాలగా మార్చాలని నివేదిక పంపామన్నారు. రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను కాపాడటానికి ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. 1,403 పాఠశాలల్లో 83,240 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నామన్నారు. మనబడి మన భవిష్యత్తు పథకం కింద 1,571 పనులు మంజూరు కాగా 1,052 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 519 పనులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. మరో రూ.4.43కోట్లతో 147 పనులు సమగ్ర శిక్ష అభియాన్ కింద జరుగుతున్నాయన్నారు. పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. నల్లమడ కాల్వ ఆధునికీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. గుంటూరు ఛానల్ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం, భవనాసి మినీ రిజర్వాయర్ కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 92 ఎత్తిపోతల పథకాలు ఉండగా 67 పాక్షికంగా పనిచేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద నిరుపేదలకు జీవనోపాధి కల్పించాలని ఆదేశించారు. పనులు విస్తతంగా చేపడితే అభివద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నయన మనోహరం ‘శ్రీ శంకర విజయం’

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కమనీయం నాటికలోని ఓ సన్నివేశం

ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి పివిఆర్ మున్సిపల్ గ్రౌండ్స్ ఆవరణలో శ్రీ నళినీప్రియా కూచిపూడి నత్య నికేతన్ ఆధ్వర్యంలో, యస్.వి. శివకుమారి నత్య దర్శకత్వంలో ప్రదర్శించిన శ్రీ శంకర విజయం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ నత్య రూపకాన్ని నెమ్మాని సీతారామ మూర్తి రచించగా, శాంతి జే బాలార్క సంగీతం అందించారు. అంతకు ముందు గుంటూరు శ్రీ సద్గురు కళానిలయం, మునిపల్లి విశ్వనాథ్ రచించిన బసవరాజు జయశంకర్ దర్శకత్వంలో ప్రదర్శించిన కమనీయం నాటకం వీక్షకులను ఆకట్టుకుంది. అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాలని, ఆధునిక సాంకేతిక వ్యవస్థలో యూ ట్యూబ్, వంటి మాధ్యమాల ప్రభావంతో ప్రాచీన కళారంగం ఆదరణ కోల్పోతున్న వైనాన్ని కనుల ముందుంచారు. కేవలం మూడు పాత్రలలో గుడివాడ హరి, గుడివాడ లహరి, వేణుగోపాల్ రెడ్డి జీవించారు. రమణ, దక్షిణమూర్తి, నరహరి, అనిల్, చౌదరి, రాము ఈ నాటికకు సాంకేతిక సహకారం అందించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు కళాకారులను ఘనంగా సత్కరించారు. కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద్, ఈపూరు శివప్రసాద్ కళపరిషత్ కో- ఆర్డినేటర్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అందుబాటులోకి బ్యాటరీ వాహనాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిజిహెచ్‌లో ఉన్న బ్యాటరీ వాహనాలు

జిజిహెచ్‌లో బ్యాటరీ వాహనాలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సొంత నిధులతో వీటికి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మాగుంటకు జిజిహెచ్ సూపరింటెండెంట్ జమున, ఆర్‌ఎంఒ మాధవీలత, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.